## క్లుప్తంగా

### మత్స్యావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం : భీమిలిలో జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అవతార విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

### శాంతి భద్రతలు కాపాడాలని వినతి



డీజీపీ ద్వారకా తిరుమలరావుతో శ్రీనివాసరావు, శంకరరావు

తగరపువలస : రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరుతూ ఆనందపురానికి చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు డీజీపీ ద్వారకా తిరుమలరావును కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేశన శంకరరావుతో కలిసి మంగళగిరిలో డీజీపీని మంగళవారం కలిశారు. ముఖ్యంగా బీసీ కులాలపై దాడులు, అత్యాచారాలు పునరావృతం కాకుండా చూడాలని కోరినట్టు తెలిపారు.

### పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష అలంకరణ



విశేష అలంకరణలో ఆంజనేయ స్వామి

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద గల శ్రీ సిద్దేశ్వర స్వామి పీఠంలోని పంచముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం సింధూరం, తమల పాకులతో అర్చకులు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రటి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామికి అరటి పండ్లు, గారెలు, తమలపాకులతో దండలు వేసి విశేషంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరయ్యారు. భక్తులకు ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సతీష్, నాగేశ్వరరావు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

### 4వ వార్డులో పారిశుధ్య పనులు



కాపులుప్పాడలో పిచికారి చేస్తున్న సిబ్బంది

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డులో జ్వరాలు విజృంభిస్తున్నందున జీవీఎంసీ జోన్ – 1 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి ఆదేశాల మేరకు మంగళవారం కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, జేవీ అగ్రహారం ప్రాంతాల్లో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది పిచికారి చేశారు. అదేవిధంగా నిల్వ నీరు, చెత్త ఉన్నచోట పారిశుధ్య సిబ్బందితో తొలగించి, ప్రత్యేకంగా పిచికారి చేయించారు.

### కుర్చీలు పంపిణీ

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు చిన రుషికొండ ఓడపాలెంలో గల అంగన్‌వాడీ కేంద్రానికి రుషికొండ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కుర్చీలు అందజేశారు. కేంద్రానికి గర్భిణులు వస్తున్నప్పుడు కూర్చునేందుకు ఇబ్బంది పడుతున్నందున కుర్చీలు అందజేసినట్లు అసోసియేషన్ సభ్యుడు జగదీష్ తెలిపారు.



# మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- చంద్రంపాలెం హైస్కూల్ సందర్శించిన డీఈవో చంద్రకళ



చంద్రంపాలెం హైస్కూల్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న డీఈవో చంద్రకళ

మధురవాడ : పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ చెప్పారు. మంగళవారం సాయంత్రం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో మౌలిక వసతులు, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీసారు. ఇక్కడ తాగునీటి సమస్య, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సక్రమంగా లేకపోవడం, పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఇబ్బందికరంగా పెరగడం, విద్యార్థులు భయపడేలా వున్న పరిస్థితులు గమనించారు. దీంతో తక్షణమే ఇంజినీరింగ్ శాఖ అధికారులను పిలిపించి బోరు నిర్మించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సరఫరా చేయాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పాఠశాల పరిసరాల్లోని పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు, ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



కూరగాయల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి



నిమ్మకాయల అలంకరణలో మజ్జివలస రాస పోలమాంబ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం వివిధ రకాల కూరగాయలు, గజమాలలతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అలంకరణకు ఇమంది వెంకటరాజు, స్వాతి సహకరించారు. ప్రసాదాల పంపిణీకి గిడుతూరి జయరామ్, బాషిణి దంపతులు సహకారం అందించారు. అలంకరణను భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు పూర్తి చేశారు. భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. అమ్మవారి అలంకరణకు కృష్ణంరాజుపేటకు చెందిన సరగడ ఎర్రయ్యరెడ్డి, సుజాత, ప్రసాదాలకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు సహకరించారు.

# గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు



ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తగరపువలస : పీఎంఎంఎస్‌వై కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి షహనాజ్ సాధియా ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 48 మందికి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న వారు ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవించేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ నెల ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వద్ద తనిఖీలు చేయించుకుంటూ 6వ నెల నుంచి వైద్యాధికారి సేవలు పొందాలన్నారు. దీనివల్ల సుఖ ప్రసవాలు జరుగుతాయన్నారు. హైరిస్క్ గర్భిణులను కేజీహెచ్‌కు పంపించడానికి వైద్యాధికారి పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. ప్రతీ నెల 9, 10న పీహెచ్‌సీలో నిర్వహించే పీఎంఎంఎస్‌వై కార్యక్రమంలో సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఐసీడీఎస్ భీమిలి పీవో శ్రీదేవి, సూపర్‌వైజర్ రత్నం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ ఈశ్వరరావు, ఫార్మాసిస్ట్ జయకుమార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### బ్రాహ్మణులకు అండగా నిలుస్తాం



బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో సీపీ శంఖబ్రత బాగ్చి

మధురవాడ : బ్రాహ్మణులకు అండగా నిలుస్తామని విశాఖ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అర్చక పురోహిత సంఘం, విశాఖ కేంద్ర బ్రాహ్మణ అర్చక పురోహిత్ సంక్షేమ సంఘం, బాలభాను అర్చక పురోహిత సంఘం, మధురవాడ బ్రాహ్మణ సంఘం తరఫున అర్చకులు, పురోహితులు సీపీని మంగళవారం కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు పైలా దాస్ అనే వ్యక్తి బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా అసభ్యకర పదజాలంతో బ్రాహ్మణ సమాజాన్ని కించపరిచిన విధానంపై ఫిర్యాదు చేశారు. దీనిపై సీపీ సానుకూలంగా స్పందించి, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సంఘాల సభ్యులు తెలిపారు.

# తాటితూరులో లో ఓల్టేజీ సమస్య

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు పంచాయతీని లోఓల్టేజీ సమస్య వేధిస్తోందని పలువురు వాపోతున్నారు. వేసవి తీవ్రత తగ్గినా ఇళ్లల్లో ఏసీలు, ఫ్యాన్లు పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీ, రాజవీధి, తెలగా వీధి, పల్లంటి వారి కళ్లాల్లో ఎక్కువగా లో ఓల్టేజీ సమస్య ఉందంటున్నారు. పంచాయతీలో అదనపు విద్యుత్ స్తంభాల కోసం పాలకవర్గం ఇటీవల రూ.6.49 లక్షలు చెల్లించినట్టు సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు తెలిపారు. ఈ మొత్తంతో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడంతోపాటు పాత ప్రమాదకరమైన ఇనుప స్తంభాలు మార్చడం, వాలిపోయిన లైన్లను సరిచేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గతంలో వేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి లోడును పంచాయతీ మొత్తం సమస్య లేకుండా సర్దుబాటు చేయాల్సి ఉందన్నారు. గతంలో పల్లంటి వారి కళ్లాల వద్ద వాలిన లైన్ నుంచి విద్యుత్ తీగలు తగిలి లక్ష్మణ్ అనే వ్యక్తి చనిపోయాడన్నారు. దీనికి సంబంధించి తీగలు సరిచేయలేదని, మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. పంచాయతీలో విద్యుత్ సమస్యలపై చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులకు మారోమారు వినతిపత్రం ఇవ్వనున్నట్టు సర్పంచ్ తెలిపారు.

# విద్యార్థుల సమస్యలపై పోరాటం



జెండా వందనం చేస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం : విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి తాము నిరంతరం పోరాటాలు చేస్తున్నామని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కో కన్వీనర్ లొడగల అచ్చిబాబు అన్నారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు, అనంతరం మాట్లాడుతూ దేశంలోనే పెద్ద విద్యార్థి సంస్థగా ఏబీవీపీ అనేక పోరాటాలు చేసిందని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించామన్నారు. నిరంతరం పోరాడుతూనే ఉంటామన్నారు. విద్యార్థుల్లో జాతీయ భావం, దేశభక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా విద్యార్థుల సమస్యలపై తమను సంప్రదిస్తే సాయపడతామని వెల్లడించారు. సభ్యులు ముద్దాడ వెంకటేష్, సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.

### బడ్డీలో చోరీ

పీఎం పాలెం : జీవీఎంసీ 7వ వార్డు పరిధి ఉడా రోడ్డు నుంచి వాంబేకాలనీకి వెళ్లే మలుపులో ఉన్న కిల్లీ బడ్డీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ క్రైమ్ విభాగం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత మధురవాడకు చెందిన ఎం.శ్రీను కిల్లీ బడ్డీ నడుపుతున్నాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ బడ్డీ తలుపులు పగలగొట్టి నగదు, టేబుల్ ఫ్యాను, డ్రింక్ బాటిళ్లు దోచుకుపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని క్రైమ్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

# డెంగ్యూపై అవగాహన అవసరం



చిన్నయ్యపాలెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తగరపువలస : డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా ఆనందపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కుసులవాడ పంచాయతీ చిన్నయ్యపాలెంలో ఆరోగ్య సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. అందులో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి జరుగుతుందన్నారు. నీటి కుండీలు, ట్యాంకులు, నీళ్ల డ్రమ్ములపై పూర్తిగా మూతలు ఉంచాలన్నారు. ఈ జాగ్రత్తలు తీసుకుంటే నీటిలో దోమలు వృద్ధి చెందవన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే దగ్గరలోని ఆశా కార్యకర్త లేదా వైద్య సిబ్బంది వద్దకు తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 25 మందికి వైద్యసేవలు అందించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు లేకుండా తనిఖీ చేసి లార్వాలను నిర్మూలించారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఆరోగ్య పర్యవేక్షకుడు కృష్ణమోహన్, ఏఎన్ఎం దేవి, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, ఆరోగ్య కార్యకర్తలు తారకేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎంపీపీ రాంబాబు అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎంపీపీ రాంబాబు, నాయకులు

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపీపీ కేక్ కట్ చేశారు. ఎంపీపీని జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి సన్మానించారు. ఎంపీడీవో బి.శైలజ, మండల పరిషత్ సూపరింటెండెంట్ పి.రాధతోపాటు పలువురు అధికారులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజయనగరం జిల్లా కొత్తవలసలోని మానసిక వికలాంగుల పాఠశాలలో 65 మంది విద్యార్థులకు కేఆర్‌బీ యూత్ ఆధ్వర్యంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మరగడ అప్పారావు, బుగత సత్యనారాయణ, ఈర్ల ఈశ్వరరావు, అముజూరి అప్పారావు, తాలాడ పద్మనాభం, బోని చైతన్య, కోన రమణ, చందక శ్రీను, చందక పైడినాయుడు, మామిడి శివ రామకృష్ణ, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, తోనంగి అప్పలనాయుడు, బూసురోతు అప్పారావు, బుగత శ్రీనివాసరావు, కనకల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

### ప్రసాదరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రసాదరెడ్డి దంపతులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి పీవీజీడీ ప్రసాదరెడ్డిని భీమిలి వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం నగరంలో కలిసి సన్మానించారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను రెడ్డిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి, వైఎస్సార్‌సీపీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, నాయకులు దల్లి అప్పలరెడ్డి, నీలాపు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల షాపుల్లో విస్తృతంగా తనిఖీలు



బిల్లుల పుస్తకం పరిశీలిస్తున్న సీఐ రవి ప్రసాద్, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చౌదరి



వేములవలసలోని దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లిలో అనుమాలు శెట్టి ఎరువుల షాపును విశాఖపట్నం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్.రవి ప్రసాద్, రంప చోడవరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీ.హెచ్.కె.వి.చౌదరి తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, గోదాములోని నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎరువులు కొనుగోలు చేసే రైతులకు తప్పకుండా బిల్లులు చెల్లించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వ్యాపారాలు చేసే వారు సర్టిఫికెట్లు కలిగి వుండాలన్నారు. ఎరువుల వ్యాపారం చేసే వారు తప్పనిసరిగా వో సర్టికేట్, పురుగు మందుల వ్యాపారం చేసే వారు ప్రిన్సిపల్ సర్టిఫికెట్ సంబంధిత కంపెనీల నుంచి తీసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు లేకుండా వ్యాపారం చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. భీమునిపట్నం టెక్నికల్ వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రీకాంత్, పద్మనాభం ఏవో ఎంవీఎస్ చలం పాల్గొన్నారు.

**అధీకృత డీలర్ల నుంచే కొనుగోలు చేయండి**

తగరపువలస : రైతులు అధీకృత డీలర్ల నుంచే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ ప్రత్యేక బృందం సూచించింది. మంగళవారం ఆనందపురం మండలం వేములవలసలో ప్రత్యేక బృందం ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే షాపులకు సంబంధించిన లైసెన్సులు, అమ్మకం ధరలను పరిశీలించారు. స్టాక్ వివరాలతో గిడ్డంగులలో నిల్వలు సరిపోయినట్టు గుర్తించారు. కొనుగోలుదారులకు అన్ని వివరాలతో కూడిన రశీదులు అందించాలని సూచించారు. ఈ బృందంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం వ్యవసాయశాఖ ఏడీ కేవీ చౌదరి, విజిలెన్స్ సీఐ రవిప్రసాద్, మండల ఏఓ చావా సంధ్యా రత్నప్రభ ఉన్నారు.

### భజన బృందం ప్రారంభం



చిల్లపేట వీరాంజనేయస్వామి ఆలయంలో భజన చేస్తున్న సభ్యులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డులకు చెందిన భజన బృందం సభ్యులు సమకూర్చుకున్న కొత్త వాయిద్యాలు మంగళవారం చిల్లపేట వీరాంజనేయుని సన్నిధిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ దైవామృత భజన గీతాలను ప్రచారం చేస్తామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా సొంత ఖర్చులతో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సభ్యులు చిల్ల సూరిబాబు, సరగడ శివాంజనేయరెడ్డి, ఉప్పాడ రమణ, ఆదిరాజు, సూరిబాబు, రామారావు, వెంకటరావు, రవ్వ ఆనంద్, తిరుపతిరావు, చిరంజీవి, సూర్యం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలతో జీవితం నాశనం

ఆరిలోవ: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంళవారం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలన్నారు. కొంత మంది విద్యార్థి దశ నుంచే గంజాయికి అలవాటుపడుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సరదాగా మొదట్లో గంజాయి, మద్యం తాగడంతో అది అలవాటుగా మారి భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని గమనించి మోసపోవద్దని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పోలీసుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మహారాణిపేట: పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధాన ధ్యేయమని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. మంగళవారం కేజీహెచ్‌లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి పరీక్షలు చేయాలని తాను కోరిన వెంటనే కేజీహెచ్ సూపరింటెండెంట్ స్పందించారని తెలిపారు. సిబ్బందిని పరీక్షించేందుకు స్పెషలిస్టు వైద్యులను కూడా పిలిచారని తెలిపారు. ఈ శిబిరాన్ని రెండు వారాల పాటు కొనసాగిస్తారని, ప్రతి పోలీసు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎల్లప్పుడు బిజీగా ఉండే పోలీసులకు కూడా వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత నెల సుమారు 3500 మంది పోలీసు సిబ్బందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం నాటి మెడికల్ క్యాంపులో వారిలో 49 మంది పోలీసులకు వైద్య సేవలు అందించి మందులు ఇచ్చారు. వీరిలో ఒకరికి శస్త్ర చికిత్స చేయవలసినదిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం, ఏఆర్ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణకు బీఆర్‌టీఎస్‌లో సన్నాహాలు



పెదగదిలి వద్ద జేసీబీ సహాయంతో విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణకు జీవీఎంసీ అధికారులు బీఆర్‌టీఎస్ రోడ్డును సన్నద్ధం చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా హనుమంతవాక నుంచి అడవివరం వరకు జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది మంగళవారం విద్యుత్ దీపాలను పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, వాటికి అమర్చిన బల్బులు వెలుగుతున్నాయో? లేదో? జేసీబీ సహాయంతో పైకి ఎక్కి పరిశీలించారు. వెలగని బల్బులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి అమర్చారు. జీవీఎంసీ జోన్–2 కమిషనర్ శైలజావల్లి టీపీవో వరప్రసాద్, సచివాలయాల సిబ్బందితో కలిసి బీఆర్‌టీఎస్‌లో పర్యటించారు. రోడ్డు పక్కన బడ్డీల నిర్వహణను పరిశీలించారు. పెదగదిలి, చినగదిలి కూడళ్లలో రోడ్డు మీద నిర్వహిస్తున్న బడ్డీలను లోపలికి జరిపించారు. బడ్డీల పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. మంగళవారం మాధవధారలో ఆర్‌టీఏ కార్యాలయంలో సిబ్బంది, ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో జె.రామ్‌కుమార్, ఆర్‌టీఏ సిబ్బంది, పోలీసులు అధికారులు పాల్గొన్నారు.

### 'స్టాప్ డయేరియా'పై అవగాహన కల్పించాలి

మహారాణిపేట: స్టాప్ డయేరియా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం భీమ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య సేవల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణులకు అందుతున్న సేవలను తనిఖీ చేసి, గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. ఎనీమియాపై ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూపీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులకు తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటించాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.